సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 7 । జూన్ । 2023



పచ్చిరొట్ట సాగుకు అదును

ఖరీఫ్‌లో భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట సాగుకు ఇదే మంచి సమయమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

8లో ▸



గంజాయి స్వాధీనం

ఏలూరు, పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

8లో ▸

పెళ్లికి హాజరై తిరిగివెళ్తూ..

రాజమహేంద్రవరంలో పెళ్లి హాజరై తిరిగి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను కృష్ణా జిల్లా వాసులుగా గుర్తించారు.



8లో

న్యూస్‌రీల్

బాల్య వివాహాల్ని అరికట్టాలి



జీలుగుమిల్లిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యుడు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): బాల్య వివాహాలతో నష్టాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కలిగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జంగం రాజేంద్ర ప్రసాద్ అన్నారు. జీలుగుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాల నిషేధంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలను సమష్టి కృషితో అరికట్టవచ్చన్నారు. రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యురాలు గంజిమాల దేవి మాట్లాడుతూ ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ ఆర్గనైజర్ వందనపు సాయి బాల పద్మ, సచివాలయ శాఖ ఎస్‌బీసీసీ జిల్లా కోఆర్డినేటర్ టిఎన్ స్నేహన్, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్స పోచమ్మ, సర్పంచ్ సిర్రి జగదాంబ, బుట్టాయగూడెం సీడీపీవో ఏలూరు తులసి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్వహణకు 10లోగా ధ్రువీకరణ పొందాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో వయోవృద్ధుల కోసం నిర్వహించే వృద్ధాశ్రమాల కోసం తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం -2007 ప్రకారం ధ్రువీకరణ పత్రాన్ని ఈ నెల 10లోగా పొందాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు నీలకంఠ ప్రధాన్ ఒక ప్రకటనలో కోరారు. వృద్ధాశ్రమ నిర్వహణకు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉందని, సెక్షన్-19 (14) నియమం కింద జారీ చేసిన ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ లేకుండా వృద్ధాశ్రమాలు కొనసాగిస్తే రూ. 25 వేలు జరిమానాతో పాటు శిక్షకు అర్హులవుతారన్నారు. జిల్లాలోని వృద్ధాశ్రమ నిర్వాహకులు విధిగా ధ్రువీకరణ పత్రాలను గడువు తేదిలోగా పొందాలని కోరారు. మరింత సమాచారానికి జిల్లా కార్యాలయం ఫోన్ నెంబర్ 08812- 234146ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలన్నారు.

జిల్లాగా, జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

పోలవరం రూరల్: పోలవరాన్ని జిల్లాగా, జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించినట్లు పోలవరం మండలం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సస్యశ్యామలమవుతుందనే మంచి ఆలోచనతో ప్రాజెక్టు నిర్మాణం వలన మండల ప్రజలకు ఎన్ని కష్టనష్టాలు వచ్చినా భరిస్తూ వచ్చారన్నారు. తాజాగా పోలవరాన్ని జిల్లాగా ప్రకటిస్తున్నారని సమాచారం నేపథ్యంలో పోలవరాన్ని జిల్లా కేంద్రంగా పరిగణించాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరి వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

మ్యాథ్స్ పరీక్షకు 78.20 శాతం హాజరు

సాక్షి, భీమవరం: సోమవారం నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మ్యాథ్స్ పరీక్షలో 7,508 మంది విద్యార్థులకు 5871 మంది హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకట రమణ తెలిపారు. 1637 మంది గైర్హాజరయ్యారని, 78.20 శాతం హాజరు నమోదైందని తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఈఓ చెప్పారు.

డీటీసీగా శాంతకుమారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా ఉప రవాణ కమిషనర్‌గా ఎస్.శాంతకుమారి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె కడప జిల్లాలో ప్రాంతీయ రవాణా అధికారిగా పని చేస్తూ పదోన్నతిపై ఏలూరు ఉప రవాణా కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ రవాణా శాఖ ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందిస్తామన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. డీటీసీగా బాధ్యతలు తీసుకున్న శాంతకుమారిని ప్రాంతీయ రవాణా అధికారి కే.శ్రీహరి, జంగారెడ్డిగూడెం ఆర్టీఓ ఎండీ మదాని, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా జయలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఏలూరు జిల్లా రిజిస్ట్రార్‌గా జేయూఎన్ జయలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న పీవీవీ దుర్గా ప్రసాద్ బదిలీపై మచిలీపట్నం జిల్లా రిజిస్ట్రార్‌గా వెళ్ళారు. ఆ స్థానంలో ప్రస్తుతం ఆ శాఖ ఐజీ కార్యాలయంలో అసిస్టెంట్ ఐజీగా పని చేస్తున్న జయలక్ష్మిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆమె గతంలో జిల్లా రిజిస్ట్రార్‌గా రెండు నెలలు ఇన్‌చార్జ్ హోదాలో పనిచేశారు.

పర్యాటక కేంద్రంగా పోలవరం

- చర్యలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశం
- పోలవరంలో పర్యటించిన ముఖ్యమంత్రి
- ప్రాజెక్టు సమగ్రంగా పరిశీలించిన సీఎం.. నిర్వాసితుల పునరావాసంపై చర్చ
- ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన మంత్రులు, ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలవరాన్ని మంచి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. పోలవరం వద్ద ప్రత్యేకంగా బ్రిడ్జిని నిర్మించడంతో పాటు పర్యాటకులు బస చేయడానికి వీలుగా హోటళ్ళతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సందర్భంగా అధికారులకు ఈ మేరకు సూచనలు చేశారు. మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఏర్పాటైయితే పోలవరం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా కసరత్తు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

కాఫర్ డ్యాంలు, దయాఫ్రమ్ వాల్ పరిశీలన

ఉదయం 10.05 గంటలకు పోలవరంలోని హెలీప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి బయలుదేరి తొలుత ఎగువ కాఫర్ డ్యాంను పరిశీలించారు. అక్కడ పనుల పురోగతికి సంబంధించి అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి నేరుగా దిగువ కాఫర్ డ్యాంకు చేరుకుని పనులను పరిశీలించారు. అక్కడ కూడా ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం గతేడాది వరదలకు దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మరమ్మతుల పనుల గురించి అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా అక్కడ ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా పనుల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం అధికారులతో ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించారు.





మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పోలవరం ప్రాజెక్టు వద్దకు వెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

దాదాపు గంటన్నరకు పైగా పోలవరంలో పర్యటించి అనంతరం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు పనుల పురోగతిని సీఎంకు విన్నవించారు. స్పిల్‌వే కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని, 48 రేడియల్ గేట్లు, రివర్స్ స్లూయిజ్ గేట్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాం నిర్మాణాలు, గ్యాప్-3 వద్ద కాంక్రీట్ డ్యాం నిర్మాణం, పవర్‌హౌస్‌లో సొరంగాల తవ్వకం, అప్రోచ్ చానెల్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని వివరించారు. పునరావాసంపై సీఎం సమీక్ష నిర్వహించారు. పునరావాస కాలనీల్లో అన్ని సామాజిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 12,658 నిర్వాసిత కుటుంబాలను ఇప్పటికే తరలించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. దాదాపు మూడు గంటలకుపైగా పోలవరంలో పర్యటించి మధ్యాహ్నం 1.15 గంటలకు ముఖ్యమంత్రి తిరిగి పయనమయ్యారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎంపీలు కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్, జీ.మాధవి, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, జయమంగళ వెంకటరమణ, షేక్ సాబ్జీ, వీ.చిరంజీవి, అనంత ఉదయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు ఆళ్ళ నాని, తెల్లం బాలరాజు, మేకా వెంకట ప్రతాప అప్పారావు, ఉన్నమట్ల ఎలీజా, కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు, తలారి వెంకట్రావు, ఎస్.ధనలక్ష్మి, కే.బయ్యాలక్ష్మి, చెట్టి పాల్గుణ, జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్, కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, సుమిత్రకుమార్‌గాంధీ, డీఐజీ జీవీవీ అశోక్ కుమార్, చీఫ్ ఇంజినీర్ సీ.నారాయణరెడ్డి, మేఘా సంస్థ ఎండీ పీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోలవరం ప్రాజెక్టు హెలీప్యాడ్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ మంత్రి విశ్వరూప్, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, పుప్పాల వాసుబాబు, మేకా ప్రతాప అప్పారావు, ఎలీజా, బాలరాజు, తలారి వెంకట్రావు, అబ్బయ్య చౌదరి, డీఎన్నార్, ఎమ్మెల్సీ వెంకట రమణ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి, జేసీ లావణ్య వేణి

సంచార జాతుల సంక్షేమానికి స్పెషల్ డ్రైవ్

కలెక్టర్ పి.ప్రశాంతి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): సంచార జాతులు, యానాదుల సంక్షేమం కోసం ఈ సంవత్సరం ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్ చాంబర్‌లో సంచార జాతుల స్థితిగతులపై సంచార జాతుల చైర్మన్ పెండ్ర వీరన్న, ఇతర అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సంచార జాతులు, యానాదుల సంక్షేమం కోసం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి, వారికి విద్య, వైద్యం, వసతి సౌకర్యాల కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 36 ప్రాంతాల్లో వివిధ కులాల సంచార జాతులు, యానాదులు ఉన్నారని తెలిపారు. వీరి పిల్లలు విద్యకు దూరమై బడి బయట ఉండడం, లేదా ఏదో ఒక పనిలో ఉంటున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితి నుంచి సంచార జాతుల కుటుంబాలను జాగృతం చేయడం కోసం విద్య, వైద్యం, రెవెన్యూ, పోలీస్, కార్మిక శాఖ అధికారులతో టీంలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీరి కోసం ప్రతినెల క్రమం తప్పకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. గర్భిణులు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఇస్తామన్నారు. తాడేపల్లిగూడెం డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న యానాదులను ఇప్పటికే గుర్తించి వారి జీవనశైలిలో మార్పు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ప్రధానంగా నరసాపురం మండలం సీతారాంపురంలో యానాదులు, పాలకొల్లు మండలం లంకలకోడేరులో మందుల, యానాదుల కులస్తులు, పాలకొల్లు పట్టణంలో బుడబుక్కలు, వీరవాసరంలో గంగిరెద్దులు, యానాదులు, రాయకుదురులో మందుల, మండపాకలో బుడబుక్కల, తణుకు పట్టణం ఫ్లైఓవర్ పక్కన రాజన్నలు, అత్తిలి గ్రామంలో గంగిరెద్దులు, యానాదులు, మందుల, తాడేపల్లిగూడెంలో దొమ్మర, ఫ్లైఓవర్ సమీపంలో యానాదులు, పెంటపాడు మండలం పత్తిపాడులో మందుల, ఆకివీడులో చెంచుల కులస్తులు ఉన్నారని తెలిపారు. మిగతా ప్రాంతాల్లో కూడా సంచార జాతులు ఉన్నారన్నారు. సమావేశంలో డీఈవో ఆర్.వెంకటరమణ, ఎస్ఎస్ఏ పీఓ శ్యాంసుందర్, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక దిగుబడులే లక్ష్యం

- వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఉద్యాన వర్సిటీలో రూ. 5 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



ఉద్యాన వర్సిటీలో సెంట్రల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు మార్కెటింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో సుమారు రూ.5 కోట్ల మేర అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణతో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే విజ్ఞాన కేంద్రంలో జరిగిన సభలో మంత్రి కాకాణి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. రైతులకు మేలు చేసే దిశగా విశ్వవిద్యాలయాలు పనిచేయాలన్నారు. మానవ వనరుల అభివృద్ధి, పరిశోధన, అభివృద్ధిపై విశ్వవిద్యాలయాలు దృష్టి సారించాలన్నారు.

రాష్ట్ర విధానాలు దేశానికే ఆదర్శం

రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి కాకాణి చెప్పారు. ఉద్యాన డిప్లమో చేసిన ప్రతి విద్యార్థికీ నేడు రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం నుంచి బయటకు వచ్చిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తు చేశారు. కేంద్రం సైతం రాష్ట్రం విధానాలకు తలొగ్గి ఫసల్ బీమాలో మార్పులు చేసి, తిరిగి ఆంధ్రప్రదేశ్‌ను భాగస్వామ్యం చేసిందని ప్రకటించారు.

రైతు కష్టం తీర్చే నేత సీఎం వైఎస్ జగన్

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ 2007లో శ్రీకాకుళం వరకు ఉన్న 18 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలను అభివృద్ధి చేసే దిశగా ఒక ప్రాజెక్టును రూపొందించి దానిని వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. దాని ఫలితమే నేడు వెంకట్రామన్నగూడెం ఉద్యాన వర్సిటీ అని చెప్పారు. రైతుకు ఎలాంటి కష్టం వచ్చినా తీర్చే నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తుచేశారు. రైతు పండించిన పంటకు పొరుగు రాష్ట్రాల కంటే అదనంగా గిట్టుబాటు ధర అందిస్తున్నామన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, వర్సిటీ బోర్డు సభ్యుడు ఉన్నమట్ల ఎలీజా, వర్సిటీ ఉపకులపతి టి.జానకీరామ్, రిజిస్ట్రార్ బి.శ్రీవాత్సల్య, లైబ్రేరియన్ నరేష్ నాయుడు, డీన్ పద్మావతి, కేవీకే శాస్త్రవేత్త ఇ.కరుణశ్రీ, వర్సిటీ సిబ్బంది, ఎంపీపీలు పొనుకుమాటి శేషులత, ఘంటా శ్రీలక్ష్మి, వెంకట్రామన్నగూడెం సర్పంచ్ నాగ అంజూష పాల్గొన్నారు.

పోలవరం పూర్తికి సీఎం జగన్ కృషి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కలలు గన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డితోనే సాకారం కాబోతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం బాలరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు కేవలం ఏటీఎంగానే వాడుకుని ప్రాజెక్టు పనులను పూర్తి నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో ఎంతో ఓర్పుతో పలుమార్లు చర్చలు, సంప్రదింపులు జరిపారన్నారు. అలాగే అనేకసార్లు ప్రధాని మోదీతోపాటు అమిత్‌షా, జలశక్తి శాఖ మంత్రి షెకావత్‌ల దృష్టికి తీసుకువెళ్లి అనేక సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్ ఎనలేని కృషి చేశారని చెప్పారు. కేంద్రం నుంచి రావలసిన నిధులను కూడా రాబట్టారని తెలిపారు. యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు పనులు పరుగులు తీయబోతున్నాయని అన్నారు. ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలనే సంకల్పంతో నాలుగోసారి ముఖ్యమంత్రి ప్రాజెక్టును సందర్శించి పనులను పరిశీలించారని తెలిపారు.

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

మండలి చైర్మన్ మోషేన్ రాజు





10 అడుగుల అంబేడ్కర్ విగ్రహం.. అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో మండలి చైర్మన్ మోషేన్‌రాజు, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్, ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

సాక్షి, భీమవరం: అణగారిన వర్గాలకు సమాజంలో సముచిత స్థానం కల్పించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 10 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

అంబేడ్కర్ విగ్రహం అంటే అభివృద్ధికి, జ్ఞానానికి నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. గరగపర్రులో కంచు విగ్రహాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మోషేన్‌రాజు ప్రకటించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అంబేడ్కర్ తన గురించి కాకుండా, తోటి ప్రజల గురించి పాటుపడిన వ్యక్తి అని అన్నారు. చదువుతోనే ప్రగతి, వ్యవస్థ, సమాజం బాగుపడాలని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి అన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఏ ప్రాంతంలో ఎక్కడ జరిగినా భారతీయులందరికీ పండగ రోజు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ యు.రవిప్రకాష్, రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ తాటిపాక గోపాలరావు, ఆర్డీవో దాసిరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు, ప్రొఫెసర్ ఖాసిం, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.వీరయ్య, మేడిది జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


హెచ్‌సీ బి.బాలాజీ

టి.నరసాపురం: టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ బి.బాలాజీ (48) సోమవారం రాత్రి గుండెపోటు మృతి చెందారు. టి.నరసాపురం స్టేషన్‌లో పదేళ్లుగా పనిచేస్తుండగా, ఇటీవల హెచ్‌సీగా పదోన్నతి పొంది ఇదే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల బుట్టాయగూడెం స్టేషన్‌కు బదిలీ అయి రెండు రోజుల్లో విధుల్లో చేరాల్సి ఉంది. సోమవారం రాత్రి భోజనం చేసిన తరువాత బాలాజీకి గుండెపోటు రావడంతో జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.


12న గుంటూరులో మెగా సీడ్ మేళా

ఉండి: ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న గుంటూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవరణలో మెగా సీడ్ మేళా (విత్తన మహోత్సవం) నిర్వహిస్తున్నట్లు కృషీ విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పంటలకు సంబంధించిన మేలైన విత్తనాలను ప్రదర్శించడంతో పాటు విక్రయాలు చేస్తారన్నారు. వరిలో ఎంటీయూ 1061, 1224, 1262, 1293, 1318, 1156, 1075, 1271 వంటి మార్టేరు మేలు జాతి వంగడాలతో పాటు బీపీటీ రకాలైన బీపీటీ 5204, 2270, 2295, 2782, 2595, 2411, 2846, 2841, చవుడు నేలలను తట్టుకునే ఎంసీఎం 100, 125 వంటి మచిలీపట్నం వంగడాలు, నెల్లూరు రకాలైన ఎన్ఎల్ఆర్ 34449 వంగడం అమ్మకానికి లభిస్తాయన్నారు. మినుముల్లో ఎల్‌బీజీ 725, 884, 787, 904, 932, జీబీజీ–1, టీబీజీ–104, 129 రకాలు, పెసరలో ఎల్‌జీజీ 460, 607, 574, శెనగల్లో ఎబీజీజీ 810, 452, 119, 857, 776, 49, వేరుశెనగలో ధరణి, ధీరజ్, నిత్యహరిత, నారాయణి, కదిరి–6, కదిరి లేపాక్షి, నువ్వులలో వైఎల్ఎం–66, రాగిలో వకుల, తిరుమల, శ్రీచైతన్య, వేగవతి, ఇంద్రావతి, కొర్రల్లో ఎస్ఐఏ–3156, రానేడు మహానంది రకాలు, అలాగే జొన్నల్లో ఎన్‌టీజెడ్–5 వంటి మేలైన రకాల వంగడాల విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

పచ్చిరొట్ట సాగుకు ఇదే అదును

- పుష్కలంగా పోషకాలు, భూసారం మెరుగు
- నేలలో ఉష్ణోగ్రత సమతుల్యతకు దోహదం
- 50 శాతం సబ్సిడీపై విత్తనాల సరఫరా


మెట్ట ప్రాంతంలో సాగు చేస్తున్న పచ్చిరొట్ట



చింతలపూడి: జిల్లాలో ఖరీఫ్ సీజన్ పనులు మొదలయ్యాయి. ఇందు కోసం అవసరమైన విత్తనాలను ఏపీ సీడ్స్, రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను అందించడానికి వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. రైతులు తమ భూముల సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తనాలను పొందవచ్చు. ఈ పరిస్థితుల్లో భూసారాన్ని పెంచుకోవడానికి రైతులు పచ్చిరొట్ట సాగు చేపట్టాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పచ్చిరొట్ట సాగుకు ఇదే అనువైన సమయమని విజ్ఞప్తి చేస్తున్నారు. వరి నాట్ల దశకు వచ్చేసరికి పచ్చిరొట్ట కూడా అదునుకు వస్తుందని అంటున్నారు. జిల్లాలో సుమారు 5 వేల క్వింటాళ్లకు పైగా పచ్చిరొట్ట విత్తనాలను ఏటా రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోంది.

మెట్ట భూముల్లో తగ్గుతున్న పోషకాలు

మెట్ట ప్రాంత వ్యవసాయ భూముల్లో రానురాను స్థూల, సూక్ష్మ పోషక పదార్థాలు తగ్గిపోతున్నాయి. పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపద ఎక్కువగా ఉండటం వల్ల పశువుల ఎరువు పుష్కలంగా లభించేది. దీన్ని రైతులు సేంద్రియ ఎరువుగా వాడేవారు. ఈ మధ్య కాలంలో రసాయన ఎరువుల వాడకం అధికమవ్వడంతో భూసారం దెబ్బతింటోంది. భూమి నుంచి పైరుకు పోషకాలు అందడం లేదు. భూసారాన్ని పెంచడానికి రైతులు కనీసం రెండు పంటలు వేసిన తరువాత ఒకసారి అయినా పచ్చిరొట్ట పైరు సాగు చేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

పచ్చిరొట్ట సాగు వల్ల ఉపయోగాలు

పచ్చిరొట్ట సాగు వల్ల భూసారం పెరగడమే కాక చీడపీడల బెడద తగ్గుతుంది. దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి ప్రయోజనం పొందవచ్చు. సేంద్రియ పదార్థాలను నేలకు అందించడం, కలుపు మొక్కలను నివారించడం, నేలలో జీవరాశులకు ఆహారంగా, మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలను అందించే సాధనాలుగా పచ్చిరొట్ట పైర్లు ఉపయోగపడతాయి.

నత్రజని వాడకాన్ని ఆదా చేయవచ్చు

ప్రస్తుతం పొలాలకు కృత్రిమంగా ఉపయోగిస్తున్న నత్రజని వాడకాన్ని 20 నుంచి 30 శాతం వరకూ ఆదా చేసుకోవచ్చు. నేలలో నీరు, రసాయన ఎరువులు భూమి కింది పొరలకు జారిపోకుండా పచ్చిరొట్ట అడ్డుకుంటుంది. నేలలో చౌడును తగ్గించి శీతాకాలంలో కూడా నేలలోని ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉంచటానికి పచ్చిరొట్ట సాగు ఉపకరిస్తుంది. చౌడు భూముల్లో జీలుగ, నీరు నిల్వ ఉండే భూముల్లో జనుము వేసుకోవడం ఉత్తమం.

ఎంత మోతాదులో విత్తాలి

జీలుగ హెక్టారుకు 20 టన్నులు, జనుము 21 టన్నులు, పిల్లిపెసర 18 టన్నుల దిగుబడి వస్తుంది. ఇటు పశుగ్రాసం కొరత తీరడమే కాక భూమిని సారవంతం చేస్తాయి. ఎరువు కోసమైతే పచ్చిరొట్ట పైర్లను పూత సమయంలో నేలలో కలియదున్నుకోవాలి. పైరు వయసు 50 రోజుల నుంచి 60 రోజులు మించకుండా కలియదున్ని ఒకటి రెండు వారాల తరువాత నాట్లు వేసుకోవాలి. జీలుగ, పిల్లిపెసర విత్తనాలు ఎకరానికి 16 కిలోలు, జనుము 20 కిలోల చొప్పున వేసుకోవాలి.

ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు



పచ్చిరొట్ట సాగుతో భూసారం మెరుగుపడుతుంది. దిగుబడులూ పెరుగుతాయి. ఆర్‌బీకేల ద్వారా 50 శాతం రాయితీపై విత్తనాలను అందిస్తున్నాం. వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది. – బి.నాగకుమార్, ఏడీఏ

ఎంతో ఉపయోగం



ఖరీఫ్ వ్యవసాయానికి ముందు పచ్చిరొట్ట సాగు చేసి భూముల్లో చౌడును నివారించుకుంటున్నాం. పచ్చిరొట్ట కలియదున్నడం వల్ల రసాయన ఎరువుల అవసరం కూడా తగ్గుతుంది. నాణ్యమైన పంట దిగుబడులు వస్తున్నాయి.
– చేపూరి ఖాదర్ బాబు, రైతు, శెట్టివారిగూడెం

కారు ఢీకొని చిన్నారి మృతి

- ఐస్‌క్రీం కోసం వెళ్లి రోడ్డు దాటుతుండగా ప్రమాదం
- లక్ష్మీపురం వద్ద ఘటన


మృతి చెందిన చిన్నారి బుంగా సంధ్య

భీమడోలు: ఐస్‌క్రీం కొనుక్కునేందుకు వెళ్లి రోడ్డు దాటి వస్తుండగా కారు ఢీకొనడంతో ఓ చిన్నారి మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం శరభాపురానికి చెందిన బుంగా అశోక్‌కుమార్ తన కుటుంబంతో కలిసి వారం క్రితం మండలంలోని ఆగడాలలంక చానల్ రోడ్డు లక్ష్మీపురంలోని ఓ చేపల చెరువుపై కాపలా కోసం వచ్చారు. అశోక్‌కుమార్‌కు ముగ్గురు కుమార్తెలు, కాగా ద్వితీయ సంతానం సంధ్య (8). మంగళవారం మధ్యాహ్నం రోడ్డుపై ఐస్‌క్రీం కొనుక్కోవడానికి వచ్చిన సంధ్య కొనుక్కుని తిరిగి రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన చిన్నారిని ఐస్‌క్రీం వాహనంలో గుండుగొలను ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. అక్కడ నుంచి ఏలూరు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకుని వెళుతుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. సంధ్య మూడో తరగతి చదువుతోంది. అల్లారుముద్దుగా పెంచుకున్న పాప మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు విలపించారు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్: ఏలూరు, పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు పాత నేరస్తులను అరెస్టు చేసి వారి నుంచి 6.30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. శనివారపుపేట కట్టాసుబ్బారావుతోట ప్రాంతానికి చెందిన కొనాల రవితేజ, గ్జేవియర్ నగర్‌కు చెందిన నడుపూరు కల్యాణ్, అల్లూరి సీతారామరాజు జిల్లా కొత్తవీధి మండలం గుడివాడ గ్రామానికి చెందిన కూసంగి వీరబాబు అలియాస్ వీర అలియాజ్ దేవ అనే ముగ్గురూ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి రవాణా చేస్తూ ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నారు. ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం ఏలూరు హేలాపురి సిటీ వెంచర్‌లో నిందితులు ఉన్నట్లు సమాచారం రావటంతో త్రీటౌన్ సీఐ వరప్రసాద్, సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసి, వారి నుంచి 6.300 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. నిందితులను అరెస్టు చేసిన త్రీటౌన్ సీఐ వరప్రసాద్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారని డీఎస్పీ తెలిపారు. త్రీటౌన్ సీఐ కేవీఎస్ వరప్రసాద్ ఉన్నారు.

భర్త అదృశ్యం

యలమంచిలి: తన భర్త కనిపించడం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాజుల విజయ్ నాగప్రసాద్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లుకు చెందిన కాగిత శ్రీనివాసరావు హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. 2019లో ఆ కంపెనీ మూసివేయగా పాలకొల్లులో సొంతింటికి వచ్చాడు. 2021లో స్నేహితుడితో కలసి ఆన్‌లైన్ షేర్స్ బిజినెస్ చేయగా, నష్టం రావడంతో కొన్నాళ్ల నుంచి ఇంటి దగ్గరే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 5న సోమవారం ఇంట్లో బయటకు వెళుతున్నాని చెప్పి బైక్‌పై వెళ్లాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో అతని కోసం వెదకగా, చించినాడ వద్ద వశిష్ట గోదావరి వంతెనపై బైక్, సెల్‌ఫోన్ ఉన్నాయని ఫోన్ రావడంతో వెళ్లిచూడగా అవి శ్రీనివాసరావుదేనని నిర్ధారణ అయ్యింది. భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శ్రీనివాసరావు కోసం గోదావరిలో గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడపగడపకు సంక్షేమం


పెంటపాడు: ముదునూరు గ్రామంలో మూడోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

విద్యుదాఘాతానికి యువకుడి మృతి


యుగంధర్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: కోళ్లఫారం షెడ్డుపై స్ప్రింక్లర్ల మరమ్మతుల చేసేందుకు వెళ్లిన ఓ యువకుడు కాలుజారి విద్యుత్ తీగలపై పడటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మైసన్నగూడెంలో సులకాని సత్యనారాయణకు కోళ్లఫారం ఉంది. తండ్రికి సహాయంగా కోళ్లఫారం పనులను యుగంధర్ (27) చూస్తుంటాడు. కోళ్లఫారం షెడ్డుపై చల్లదనం కోసం స్ప్రింక్లర్లను ఏర్పాటు చేయగా, స్ప్రింక్లర్ల నుంచి నీరు రాకపోవడాన్ని గుర్తించారు. దీంతో యుగంధర్ వాటిని మరమ్మతులు చేసేందుకు మంగళవారం షెడ్డుపైకి ఎక్కాడు. పైన వేసి ఉన్న ఆయిల్‌పామ్ కొమ్మపై కాలు వేయగా జారి ప్రమాదవశాత్తు షెడ్ల మీదుగా ఉన్న విద్యుత్ వైర్లపై పడ్డాడు. దీంతో షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. చేతికంది వచ్చిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

39 బాటిళ్ల యానాం మద్యం స్వాధీనం

ఇద్దరి అరెస్టు, బైక్ సీజ్


మద్యం బాటిళ్లు, అరెస్టు చేసిన నిందితులతో ఎస్ఈబీ పోలీసులు

ఆకివీడు: యానం నుంచి మద్యం రవాణా చేస్తూ కాళ్ల మండలం పల్లెపాలెం ప్రభుత్వ మద్యం షాపులో పనిచేస్తున్న ఉద్యోగులు ఎస్ఈబీ పోలీసులకు చిక్కారు. వివరాలిలా ఉన్నాయి. పల్లెపాలెం మద్యం షాపులో సూపర్‌వైజర్ సీహెచ్ సాగర్, సేల్స్‌మెన్ రమణరాజు అక్రమంగా యానం నుంచి కొన్నాళ్లుగా మద్యం గుట్టుచప్పుడు కాకుండా తీసుకువచ్చి ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో వీరిపై ఎస్ఈబీ అధికారులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో మంగళవారం యానం నుంచి బైక్‌పై 39 మద్యం బాటిళ్లతో ఉన్న కేసును తరలిస్తుండగా ఆకివీడులో ఎక్సైజ్ పోలీసులకు చిక్కారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ డి.రామారావు చెప్పారు.

కారు అదుపుతప్పి.. కాలువ వైపు దూసుకెళ్లి..


ఉంగుటూరులో కాలువ గట్టుపైకి ఎక్కిన కారు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై వెళుతుండగా కారు అదుపుతప్పి కాలువ వైపు దూసుకువెళ్లి గట్టుపై నిలవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తెనాలికి చెందిన అవధానులు కారులో యానం వెళ్లి అక్కడ యజ్ఞం కార్యక్రమాలకు హాజరయ్యారు. అనంతరం మంగళవారం యానం నుంచి తెనాలికి తిరుగు ప్రయాణమయ్యారు. ఉంగుటూరు వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి కాలువ వైపునకు దూసుకువెళ్లింది. అయితే అవధానులు హ్యాండ్‌బ్రేక్ వేయడంతో గట్టుపై అడ్డం తిరిగి నిలిచిపోయింది. అనంతరం క్రేన్ సాయంతో కారును రోడ్డుమీదకు తీసుకువచ్చారు.

పెళ్లికి హాజరై తిరిగివెళుతూ..


పరిటాల రాజు మృతదేహం


చికిత్స పొందుతున్న తెల్లం గౌతమ్


బండి సంజయ్


ఘటనా స్థలంలో బైక్

- డివైడర్‌ను ఢీకొన్న బైక్, తాపీ కూలీ మృతి
- మరో ఇద్దరు స్నేహితులకు తీవ్ర గాయాలు
- హైవేపై కొండ్రెడ్డినగర్ వద్ద ప్రమాదం

భీమడోలు: రాజమహేంద్రవరంలో స్నేహితుడి వివాహానికి హాజరై తిరిగి వెళుతుండగా, నిద్రమత్తులో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ తాపీ కూలీ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని బేతవోలు గ్రామానికి చెందిన పరిటాల రాజు (20), బండి సంజయ్, తెల్లం గౌతమ్ స్నేహితులు. వీరు తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి రాజమహేంద్రవరంలో జరిగే స్నేహితుని వివాహానికి హాజరయ్యేందుకు ముగ్గురు స్నేహితులు ఓ బైక్‌పై వెళ్లారు. అనంతరం మంగళవారం తెల్లవారుజామున వీరు బైక్‌పై తిరిగి వస్తుండగా అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డినగర్ వద్దకు వచ్చేసరికి నిద్రమత్తు ఆవరించడంతో అతివేగంగా వస్తున్న బైక్ ఒక్కసారిగా అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న పరిటాల రాజు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న బండి సంజయ్, తెల్లం గౌతమ్‌లను అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. తెల్లం గౌతమ్‌ను మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. పరిటాల రాజు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబు ఎత్తుగడలను చిత్తు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసెంబ్లీ ఎన్నికల వస్తున్నాయంటే టీడీపీ అధినేత చంద్రబాబు వివిధ రాజకీయ పార్టీలతో పొత్తుల కోసం వెంపర్లాడటం, అవసరం తీరాక దూషణలు చేయడం చంద్రబాబుకు పరిపాటి అని, ఆయన ఎత్తుగడలను చిత్తు చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని కడకట్లలో మంగరాజు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. మంగరాజు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జనసేన, బీజేపీ కలిసి చంద్రబాబును అధికార పీఠంపై కూర్చోపెడితే ఆ తరువాత మిత్రపక్షాలపైన ఆరోపణలు చేసి చంద్రబాబు బయిటకు వచ్చారన్నారు. అధికారంలోకి రావడానికి ఎన్నో అబద్ధ వాగ్దానాలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తుంగలో తొక్కే మనస్తత్వం టీడీపీ అధినేతకు ఉందన్నారు. గతంలో రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పి అమలు చేయలేయని విషయం ప్రజలకు తెలుసన్నారు. అమ్మకు వందనం పేరుతో రూ.లక్ష కోట్లు ఖర్చు అయ్యే, అమలు సాధ్యం కాని హామీని చంద్రబాబు ఇవ్వడం ఎన్నికల స్టంట్‌గా కనిపిస్తోందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజలలోకి వెళ్లాయన్నారు. మరే ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ సంక్షేమ పథకాలు ఎవరికి అమలు సాధ్యం కాదన్నారు. ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఇచ్చిన హామీలు అమలు చేయడం సాధ్యమన్నారు. వీరవల్లి సునీల్, టి.అనిల్, శాంతారావు, సందీప్, బి.సునీల్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ముగ్గురికి రిమాండ్


వ్యక్తిని అరెస్ట్ చేసిన దృశ్యం

సాక్షి, భీమవరం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు చోట్ల అక్రమంగా మద్యం కలిగిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఈబీ సీఐ వీవీవీఎస్ఎన్ వర్మ చెప్పారు. యాదవుల వీధిలో గాదిరెడ్డి వెంకట సుబ్బారావును అదుపులోకి తీసుకుని, అతని నుంచి నాలుగు మద్యం సీసాలు, బొక్కావారిపాలెంలో తాళ్ల చిట్టిబాబు నుంచి ఎనిమిది మద్యం సీసాలు, అనాకోడేరులో జుత్తిగ శ్రీహరి మూర్తిని అదుపులోకి తీసుకుని 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. దాడుల్లో ఎస్సైలు జి.సునీల్ కుమార్, బి.రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, డేవిడ్ రాజు, గణేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

ముసునూరు: భర్త వేధింపులను భరించలేక ఓ వివాహిత ముసునూరు పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన ఈడ మహాలక్ష్మి (25) భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వ్యసనాలకులోనై ఇంట్లోని బంగారం, వెండి వస్తువులు, భూమి కూడా అమ్మివేశాడు. మిగిలిన భూమిని కూడా అమ్మాలని ప్రయత్నిస్తున్నాడు. ఈనేపథ్యంలోనే తనను బంధువులతో కలసి శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో రక్షణ కల్పించాలని బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

కృషి విజ్ఞాన కేంద్రానికి సంచార వ్యాన్ బహూకరణ


సంచార వ్యాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ వైఎస్సార్ హార్టి కల్చరల్ యూనివర్శిటీ ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలు విలువైన సంచార వ్యాన్‌ను అందజేశారు. మంత్రులు, యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌లు ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ ఆర్.డి.వర ప్రసాద్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉన్న రైతులకు వివిధ ఉద్యాన విస్తరణ సేవలు అందించుటకు గాను సంచార వ్యాన్‌ను అందజేసినట్లు వెల్లడించారు. అదే విధంగా రూ.3 లక్షలతో ఉద్యాన వర్శిటీ సుందరీకరణ చేసే కార్యక్రమం జరిగినట్లు వివరించారు.

మావుళ్లమ్మ సన్నిధిలో...


శ్రీమావుళ్లమ్మ వారి సన్నిధిలో రాష్ట్ర సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ గౌరీ శంకర్

భీమవరం (ప్రకాశంచౌక్) : రాష్ట్ర సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ గౌరీ శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం శ్రీ మావుళ్ళమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ ఉమా సోమేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట భీమవరం డివిజనల్ సహకార అధికారి రామదాసు, ఉద్యోగుల యూనియన్ నాయకుడు నందమూరి సుబ్బారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై కళాజాత

భీమవరం (ప్రకాశంచౌక్) : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల కళాజాత ప్రదర్శించారు. ప్రచార కార్యక్రమాలలో భాగంగా ప్రజలకు ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. మిషన్ లైఫ్‌లో భాగంగా మన జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్లోబల్ స్టూడెంట్ ఎవర్నెస్ ఆర్గనైజేషన్ వారి కళాకారుల బృందం చేత భీమవరంలోని పలు ప్రదేశాల్లో కళాజాతా ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

8 నుంచి సువార్త సభలు

ఉండి: ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్‌లో ఆధ్యాత్మిక ఉజ్జీవ రక్షణ సువార్త సభలను నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యవర్గ సభ్యులు మంగళవారం తెలిపారు. పేరిష్ పాస్టర్ రెవరెండ్ వీ నెహ్రూ ఈ సభలను ప్రారంభిస్తారని వాక్యోపదేశకులుగా బ్రదర్ కిరణ్‌పాల్(గుడివాడ),పాస్టర్ పీ సునీల్‌కుమార్(వరంగల్) నుంచి హాజరవుతున్నట్లు తెలిపారు. సంఘ కాపరి పీ కరుణాకర్‌రావు, స్థానిక సంఘ పెద్దలు, పీసీసీ సభ్యులు, కోశాధికారి, కార్యదర్శి ఆధ్వర్యంలో సభల నిర్వహణ చేస్తున్నట్లు తెలిపారు. దేవుని బిడ్డలు పెద్ద ఎత్తున ఈ సభలకు హాజరు కావాలని కోరుతున్నట్లు కార్యనిర్వాహక సభ్యులు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు నమోదు చేయాలి


బీఎల్‌వో సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫాజిల్

నరసాపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని తహసీల్దార్ ఫాజిల్ అన్నారు. నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన బూత్‌లెవెల్ అధికారుల (బీఎల్‌వో) సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 ఏళ్ల వయస్సు నిండే ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. నూతనంగా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేవారు. ఫారం నం.6 వినియోగించాలని, ఓటు తొలగింపునకు నం.7 ఫారాన్ని, కార్డులో మార్పులు, చేర్పులు, తప్పొప్పుల సవరణకు నం.8 ఫారాన్ని వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ నాగదేవి, మున్సిపల్ టీపీవో, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

చెరువులో పూడిక తీత పనులు

పెనుగొండ: ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధి దోహదపడతాయని, చేతి వృత్తిదారులకు ఎంతోగానో ఉపకరిస్తాయని సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) అన్నారు. సిద్ధాంతంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన రజకుల చెరువు పూడిక తీత పనులను ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు.

వైఎస్సార్ బీమా భరోసా

- 18 నుంచి 70 ఏళ్ల వయస్సువారు అర్హులు
- గ్రామగ్రామాన నమోదు చేపట్టిన వలంటీర్లు


పెంటపాడులో బీమా సర్వే నమోదులో పాల్గొన్న వెల్ఫేర్ సహాయకురాలు, వలంటీర్

పెంటపాడు: కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించినా, వైకల్యం బారిన పడినా ఆ కుటుంబం ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతుంది. ఆపద వేళ ఆయా కుటుంబాలను ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని తీసుకొచ్చింది. తాజాగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీమా నమోదు ప్రక్రియను ప్రారంభించింది. గ్రామగ్రామాన వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ బీమా రెన్యువల్ చేయడంతో పాటు, కొత్తగా లబ్ధిదారులను గుర్తించి పథకంలో నమోదు చేసే పనిలో బిజీగా ఉన్నారు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా అర్హులను వలంటీర్లు యాప్‌లో నమోదు చేస్తున్నారు. బీమా కింద సభ్యుల నమోదు కోసం వివరణాత్మకంగా ఇప్పటికే వలంటీర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. పెంటపాడు మండలంలో 24,158 రేషన్ బియ్యం కార్డులు ఉండగా 20,128 మంది వైఎస్సార్ బీమా పథకంలో నమోదయ్యారు. వారితో పాటు, 1182 మందికి ఈ ఏడాదికి రెన్యూవల్ చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. అందులో 36 పూర్తయ్యాయి. పాతవి రెన్యూవల్‌లో భాగంగా ఇప్పటికి 8,298 కి బీమా పూర్తి చేశారు. గతంలో బీమా ఉండి ఈనెల 10వ తేదీనాటికి పాలసీ వయస్సు ప్రమాద బీమా అర్హతకు మించితే ఆ స్థానంలోని కుటుంబంలోని మరో సంపాదన పరున్ని ఎంచుకోవచ్చు. వారిపై బీమా నమోదు చేస్తారు. పాతవి కాకుండా కొత్తగా 1,182 మంది బీపీఎల్ కుటుంబాల్లో ఈ కేవైసీ ద్వారా బీమా నమోదుకు ఈనెల 10వ తేదీ చివరిరోజు కావడంతో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నమోదు ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

కొత్త మార్గదర్శకాలు ఇలా....

బీమా చట్టం 1938లోని సెక్షన్ ప్రకారం జీవిత భాగస్వామి లేదా, పిల్లలు, లేదా, వారిపై ఆధారపడిన వ్యక్తులను ప్రాథమిక కుటుంబ పోషణదారుడు తమ నామినీని లేదా, నామినీలుగా నిమమించుకోవచ్చు. బీమా పొందే వ్యక్తి వయస్సు 18–70 ఏళ్ల మధ్య ఉండాలి. ఆ వ్యక్తి దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలి. ప్రాథమికంగా సంపాదన పరుడై ఉండాలి. బీమా తీసుకొన్న వ్యక్తి 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు సహజమరణం పొందినా బీమా వర్తిస్తుంది. సహజ మరణానికి రూ. 1 లక్ష పరిహారమైతే, ప్రమాద మరణమైతే రూ. 5 లక్షలు నగదు అందుతుంది. కాగా ఆ సొమ్మును సదరు నామినీకి చెల్లిస్తారు. ఒక వేళ బీమా దారుడు పూర్తి అంగవైకల్యం పొందితే రూ. 5 లక్షలు, పాక్షిక వైకల్యం పొందితే రూ. 2.50 లక్షలు అందజేస్తారు. పాలసీదారుడు మరణిస్తే సచివాలయంలో సంక్షేమ సహాయకునికి సమాచారం అందించిన వెంటనే ప్రభుత్వం ద్వారా అంత్యక్రియల ఖర్చుకు రూ. 10 వేలు అందజేస్తారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వైఎస్సార్ బీమా లబ్ధిదారున్ని గుర్తించి పథకంలో నమోదు చేస్తున్నాం. అర్హత కలిగిన వారందరికి బీమా ఉండేలా అవగాహన కల్పించి పథకంలో చేరుస్తున్నాం. ఇది లబ్ధిదారులకు ఎంతో ఉపయోగమైనది.

– లక్ష్మి పార్వతి, వలంటీర్, రాచర్ల

పేదలకు లబ్ధిచేకూర్చేలా..



బీమా పథకంలో పేదలకు లబ్ధి చేకూర్చేలా వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. కుటుంబంలోని పోషించే వ్యక్తి మరణించినా, వైకల్యం బారిన పడిన సందర్భంలో వైఎస్సార్ బీమా పథకం ఆ కుటుంబానికి ఆర్థిక ఉపశమనం కలిగిస్తుంది.

– ఎస్. గోవర్ధన్, వెల్ఫేర్ సహాయకులు రాచర్ల

అలంపురం కార్యదర్శిగా బేగ్


ఇలియాస్ బేగ్

పెంటపాడు: పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో భాగంగా అలంపురం గ్రామ నూతన కార్యదర్శిగా ఇలియాస్ బేగ్ నియమితులయ్యారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో గ్రేడ్–1 కార్యదర్శిగా పనిచేస్తున్న ఇలియాస్ బేగ్ అలంపురం గ్రామ కార్యదర్శిగా నియమితులై బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీపీవో మల్లికార్జునరావు, ఎంపీడీవో బాలాజీలను మర్యాద పూర్వకంగా కలుసుకొన్నారు. అందరినీ సమన్వయం చేసుకొంటూ, గ్రామాభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం వద్ద మజ్జిగను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : స్థానిక అంకాలమ్మ చెట్టు వద్ద శేఖర్, రవికుమార్, శ్రీనివాస్ శైలేంద్రలు మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఏర్పాటుచేశారు. అవైపు రాకపోకులు సాగించే వాహనదారులకు, స్థానికులకు మంజ్జిగను పంపిణీ చేశారు. ఎండలు మండుతున్న కారణంగా ప్రయాణికులు, వాహనదారులకు దాహార్తిని తీర్చేందుకు అంకాలమ్మ చెట్టు వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రతినిధులు తెలిపారు.

విజ్ఞానం.. వికాసం


తాడేపల్లిగూడెం వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. పట్టణంలో గ్రేడ్–1 గ్రంథాలయంలో ఆహ్లాదకరంగా వేసవి శిక్షణ శిబిరం 29వ రోజు మంగళవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు ప్రత్తి వీరాస్వామిచే గ్రంథాలయంలోని పుస్తకాలను చదివించడం, నీతి కథలు చెప్పారు. ఎ.జనార్ధనరావుచే హిందీ బోధించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు మహాభట్టు లక్ష్మణరాజుచే దేశభక్తి గీతాలు నేర్పించారు. గరికిపాటి బాపయ్య శర్మ విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై అవగాహన చేశారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మంగళవారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు యర్రమిల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో గణితంలో అబాకస్ విధానం, పజిల్స్ పూర్తి చేయించడం, వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలును నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రీసోర్సుపర్సన్ బాలా త్రిపుర సుందరి, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ పాల్గొన్నారు.

తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో తెలుగు గజిబిజి పదాలను చెప్పించడం వంటి వాటితో పాటు యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. సీహెచ్ సీతారామాంజనేయులు, జీ బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండా

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- ముదునూరులో గడపగడపకు మన ప్రభుత్వం


ముదునూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: రాష్ట్రంలో ప్రజలందరూ బాగుండాలన్న ఆశయంతో ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజా రంజకమైన పాలన అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మంగళవారం ముదునూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రజాపాలన నాలుగేళ్లు పూర్తి చేసుకొన్న సందర్భంగా మాజీ సర్పంచ్ అద్దంకి పెద వెంకటరత్నం ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో చంద్రబాబు చేసిన ఎన్నికల వాగ్దానాలు, మ్యానిఫెస్టోలు తుంగలో తొక్కారన్నారు. రైతు రుణాలు, డ్వాక్రా రుణాలు రద్దు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. టీడీపీ మహానాడులో ముందస్తుగా రాబోయే ఎన్నికల గురించి మ్యానిఫెస్టో ప్రకటించి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు చంద్రబాబులా దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజల అవసరాలు గుర్తించి వాటిని నెరవేర్చినప్పుడే ప్రజలు సంతోషిస్తారన్నారు. ప్రజలు జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధాన్యలక్ష్మి, ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, సొసైటీల అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, ములగాల సత్యనారాయణ, బూరాడ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కొణతాల, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, పొట్ల ఏడుకొండలు, దేవాబత్తుల నాగమణి బాబి, పార్టీ నాయకులు బోణం వీరయ్య, నల్లమిల్లి విజయానందరెడ్డి, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, తహసిల్దార్ శేషగిరిరావు, పలు శాఖల ఏఈలు, సిబ్బందితో పాటు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ట్రీజర్ మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు

పెంటపాడు: చంద్రబాబు మహానాడులో ట్రీజర్ మేనిఫెస్టోను ప్రకటిస్తే ప్రజలు నమ్మెస్థితిలో లేరని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. ఈ సందర్భంగా ముదునూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్‌కు వస్తున్న ఆధరణను చూసి ఓర్వలేక మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. టీడీపీ నిండా మునిగిన పార్టీ అని ఎద్దేవా చేశారు. ప్రశ్నించడం కోసమే పార్టీ పెట్టానని చెప్పిన పవన్ కల్యాణ్, టీడీపీ అధికారంలో ఉండగా కనిపించకుండా పోయారన్నారు. షూటింగ్ గ్యాప్‌లో రెండు జిల్లాల యాత్ర చేసేందుకు ఇప్పుడు వస్తున్న పవన్ యాత్ర వల్ల ఒరిగేది శూన్యమన్నారు.

మంచినీటి పథకాలకు ప్రత్యేక ప్రాధాన్యత


జగన్నాథపురంలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామ సర్పంచ్ చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: మంచినీటి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుందని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రూ.కోటి వ్యయంతో 1.50లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ మంచినీటి ట్యాంకు నిర్మాణంతో ఎస్సీ ఏరియా ప్రజల మంచినీటి సమస్య తీరనుందన్నారు. త్వరలోనే మంచినీటి ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నార్ని నాగేశ్వరరావు (నాగులు), ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్, వార్డు మెంబర్లు అద్దాల గోపీకృష్ణ, కరిపోతు చినపుల్లారావు (పుల్లయ్య), ముప్పిడి లక్ష్మణరావు, తులా మస్తాన్, నీలం నాగేశ్వరరావు, యర్రంశెట్టి బసవయ్య, గెడ్డం రామకృష్ణ, ఉండ్రాజవరపు రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కార్యదర్శులు కృషి చేయాలి


నూతనంగా బాధ్యతలు తీసుకొన్న ఎంపీడీవో బాలాజీకి పుష్పగుచ్చం ఇచ్చి అభినందిస్తున్న కార్యదర్శులు

పెంటపాడు: అన్ని గ్రామాల్లో తాగునీరు, శానిటేషన్, వీధిదీపాల నిర్వహణ, ఇతర సమస్యలపై కార్యదర్శులు చిత్త శుద్ధితో కృషిచేయాలని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం తనను కలిసిన గ్రామ కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యదర్శులను, సిబ్బందిని పరిచయం చేసుకొన్నారు. గ్రామాలలో ప్రధాన సమస్యలను గురించి తెలుసుకొని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా నూతన బాద్యతలు తీసుకొన్న ఎంపీడీవోను కార్యదర్శుల సంఘ నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీవీ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శులు రామకృష్ణ, నాగదేవి, రామారావు, భుజంగరావు, శ్రీరంగ, బాబు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం


పెంటపాడు డీఆర్ గోయంకా కళాశాలకు ఏసీ పరికరాలను బహుకరిస్తున్న పూర్వ విద్యార్థులు

పెంటపాడు: తాము చదువుకొన్న కళాశాల ఉన్నతంగా తీర్చిదిద్దబడాలని ఆ పూర్వ విద్యార్థులు గుర్తించారు. అనుకొందే తడవుగా ఇటీవల ఆత్మీయ సమ్మేళనం చేసుకొన్న డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1975–78 బీకాం రాయల్ విద్యార్థులు కళాశాల బాగోగుల గురించి ఆరా తీసారు. ప్రిన్సిపాల్ రూంలో ఏసీ లేకపోవడం గమనించారు. అప్పటికప్పుడు బ్లూస్టార్ కంపెనీకి చెందిన 2 టన్స్ 5 స్టార్ ఏసీని బహుకరించి తన గురు భక్తిని చాటుకొన్నారు. ఈ సందర్భంగా మండలి హనుమంతరావు దంపతుల ఏసీని ప్రిన్సిపాల్ ఎం. శ్యాంబాబుకు అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులైన జంధ్యాల నాగేశ్వరరావు, కర్రి బాస్కర రావు జానకిరామ్, రవిప్రసాద్‌లు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తాము అన్ని వేళలా సహకరిస్తామన్నారు. మండలి హనుమంతరావు దంపతులను కళాశాల తరపున ప్రిన్సిపాల్ శ్యాంబాబు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విక్టర్ ప్రేమ్ సాగర్, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టండి

సాక్షి, భీమవరం : నియోజకవర్గ పరిధిలో ఉన్న స్లూయిజ్‌లను పరిశీలించి వాటికి మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పెదగరువు వద్ద ఉన్న స్లూయిజ్‌ను, శృంగవృక్షం వద్ద ఉన్న స్లూయిజ్‌లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. సార్వా పంటకు సాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈ కె.శ్రీనివాస్, ఏఈ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు యువతరం ఉద్యమంలోకి రావాలి


తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లిలో జరిగిన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటి సమావేశ దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ వర్గీకరణతోనే విద్య, ఉద్యోగ రంగాల్లో న్యాయమైన వాటా దక్కుతుందని ఎమ్మార్పీస్ మండల కోకన్వీనర్ ఇల్లెందుల వీర్రాజు అన్నారు. మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటి సమావేశం సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం విద్యార్థులు, యువతరం ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి మంద కృష్ణ మాదిగ సమక్షంలో బహిరంగ నిర్వహించనున్నామని, మాదిగలంతా సన్నద్ధం కావాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటి అధ్యక్షుడిగా కండెల్లి కాంతారావు, కార్యదర్శిగా చిగురుపల్లి గంగరాజు, ఉపాధ్యక్షుడిగా చంద్రయ్య, కార్యదర్శిగా దర్శిపాము ఏసురత్నంలు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ ఉపాధ్యక్షుడు దూలపల్లి శ్రీనివాసరావు, రామకృష్ణ, రవి, మండల ఇన్‌ఛార్జ్ చిన్ని, గాలింకి ప్రేమ్‌కుమార్, జుజ్జవరపు వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీఎస్‌వీకేలో గుండె వైద్య సేవలు

భీమవరం (ప్రకాశంచౌక్) : ఔషధాలతోపాటు సమతుల్య పోషక ఆహారం, అవసరమైన మేరకు శారీరక శ్రమ (వ్యాయామం)తో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.చంద్రశేఖర్ వర్మ అన్నారు. మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం రోగులను పరీక్షించి వారికి గుండె వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఈసీజీ, 2డి ఎకో పరీక్షలను నిర్వహించారు. శ్రీ లక్ష్మి గాయత్రి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (హైదరాబాద్), వసుధ ఫౌండేషన్‌ల సహకారంతో ఏబీఎస్‌వీకేలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. ప్రతిరోజు సాయంత్రం సాధారణ వ్యాధులు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు ప్రముఖ వైద్యులు వైద్యసేవలు అందిస్తారన్నారు. అలాగే ప్రతి మంగళవారం ఉదయం గుండె వైద్య నిపుణులు తమ సేవలను ఉచితంగా అందిస్తారని ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చండ్ర పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

సాక్షి, భీమవరం : పీడిత ప్రజల అభ్యున్నతి, సామాజిక అసమానతలు లేని సమాజం కోసం, దోపిడీ వ్యవస్థ అంతానికి తుది శ్వాస వీడేవరకు పోరాడిన యోధుడు చండ్ర రాజేశ్వరరావు అని ఆయన ఆశయాల సాధనకు అందరూ పునరంకితం కావాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో కమ్యూనిస్టు అగ్రనేత చండ్ర రాజేశ్వరరావు జయంతిని సీపీఐ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. చండ్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోనాల మాట్లాడుతూ సంపన్న కుటుంబంలో పుట్టి బెనారస్ యూనివర్సిటీలో వైద్య విద్యనభ్యసిస్తూ సమసమాజ నిర్మాణం కోసం, సామాజిక న్యాయం కోసం తన వైద్య విద్యను సైతం విడనాడి కమ్యూనిస్టు ఉద్యమాల్లో భాగం పంచుకుని పోరాడిన యోధుడు చండ్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 28 ఏళ్లు అంకితభావంతో పనిచేసి పార్టీని అగ్రభాగాన నిలిపారని ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యుడు మల్లుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.